
అది వేసవీ కాదు, చలికాలమూ కాదు. మూడు - నాలుగ్గంటల మధ్య సమయం. పట్నపు వేషాన్ని సంతరించుకుంటున్న ఆ పల్లెలో - ఊరు బయట గల విశాలమైన భవంతిలో తన గదిలో పడక్కుర్చీలో పడుకుని విశ్రాంతి తీసుకుంటూ డా॥ రాజారాం హరిశ్చంద్ర నాటకంలోని పద్యాలను వింటున్నాడు. కాటిసీనులోని జాషువా గారి పద్యాలను... హృద్యంగా ఆలపిస్తుంటే మదిలో ఏవో సంఘటనలు మెదిలి, కదిలి, కరిగి కనుల వెంట నీరై ప్రవహిస్తోంది. అలాంటి తన్మయావస్థలో ఉండగా బయట నుంచి డాక్టరుగారూ! అన్న పిలుపు, ఆ వెంటనే కుక్క అరుపూ వినబడ్డాయి. తన కోసం ఎవరో వచ్చి ఉంటారని ఇవతలకు రాబోతూంటే పెంచలయ్య వచ్చాడు పిలవాలని. క్రిందికి వచ్చేసరికి చెల్లెలు రాణి కుక్కను కసిరి, వాళ్ళను లోపలకు తీసుకువచ్చింది. 'వాళ్ళ పాపకు సీరియస్‌గా ఉందట' అంటూ గోడకు చెప్పినట్లు ముక్తసరిగా చెప్పి, తన రూమ్‌కి దారి తీసింది.



# ఎక్స్‌ట్రా కేర్‌లెస్‌ట్రాలు

“మూడు రోజుల నుంచీ జ్వరంగా ఉంది సార్. ఉదయం మరీ ఎక్కువైంది. మూసిన కన్ను తెరవడం లేదు. పైగా ఫిట్స్ వచ్చినట్లు ఎగిరెగిరి పడుతోంది. భయం వేసి వెంటనే తీసుకొచ్చాం” అన్నాడా వ్యక్తి.

పాపను టేబుల్‌పై పడుకోబెట్టి నుదిటిపై చేయి వేస్తూ, పాప వైపు పరీక్షగా చూసాడు. ఇంతకుముందు ఆ పాపను రెండు మూడు సార్లు తన డిస్పెన్సరీకి తీసుకువచ్చినట్లుగా గుర్తించాడు. పాప కళ్ళు తెరిచి చూశాడు. నాడి బాగానే ఆడుతోంది. పొట్టపై చేయి వేసి చూశాడు. ఒళ్లు కాలిపోతోంది. మంజుల తెచ్చి ఇచ్చిన కిట్‌లో నుంచి మందులు తీశాడు.

‘పాపకేమైనా ఆహారం పెట్టారా ఈ రోజు?’ అడిగాడు ఇంజక్షన్ చేయబోతూ. “ఉదయం మజ్జిగ తాగిందండి. ఇందాక కొద్దిగా బార్లీ జావ ఇచ్చాను... అన్న మాటలు వినబడి అటు చూశాడు. పాప తల్లి కాబోలు.” కళ్ళ వెంట ధారాపాతంగా నీళ్ళు కారుతున్నాయి. తన బిడ్డకేమౌతుందోనని ఆ తల్లి హృదయం తల్లడిల్లిపోతున్నట్లు గమనించాడు.

“ఏం పర్వాలేదు. తగ్గుతుంది లేమ్మా!” అన్నాడు పాపకు ఇంజక్షన్ ఇచ్చి. ‘ఫిట్సేమోనని భయంగా ఉంది సార్’ అన్నదామె డాక్టర్‌తో పాటు అవతలకు అడుగులేస్తూ.

‘చూద్దాం’. ముందు జ్వరం తగ్గనీ. ఈ రోజుకు మా అబ్జర్వేషన్‌లో ఉంటుంది కాబట్టి మరలా వస్తే పరీక్ష చేద్దాం. నేను దగ్గరుంటానుగా... భయపడాల్సిన పనేమీ లేదు’ అన్నాడు భరోసా ఇస్తూ.

పేషంటుకుగాని, అతనితో వచ్చిన వాళ్ళకుగానీ కావలసింది ఆ భరోసాయే. డాక్టరు ఓదార్పుని మించిన మందు లేదు.

కూర్చోమన్నట్లు వారికి కుర్చీలు చూపించి తాను కుర్చీలో కూర్చున్నాడు డాక్టర్ రాజారాం. ‘నీవు పాపకు తోడుంటున్నావు కదమ్మా’ అన్నాడు పాప తల్లితో. ‘తానుంటుందండీ. నేను కొంచెమాగి మరలా వస్తాను అన్నాడు పాప తండ్రి.

రాత్రి 12 గంటలు. ప్రకృతి చీకటి చీరను కప్పుకొని నిద్రపోతోంది. వాతావరణం ప్రశాంతంగా, నిశ్శబ్దంగా ఉంది. కిటికీలో నుంచి చల్లని గాలి బెడ్‌రూంలోకి ప్రవేశిస్తోంది. డాక్టర్ రాజారాం చాలా సేపటి నుంచి వైద్య శాస్త్ర పుస్తకాలను పరీక్షగా చదువుతున్నాడు. అతడు పాప కేసుని రిఫర్ చేస్తున్నాడు. కేసు చాలా టిపికల్‌గా మారింది. ముందు ఏదో మామూలు జ్వరమేలే అనుకున్నాడు. బలహీనత వల్ల ఫిట్స్‌లాగా వచ్చి ఉండవచ్చు అనుకున్నాడు. కానీ పాప ప్రవర్తన అతని గుండెను పిండి వేస్తోంది. ఊరక ఎగిరెగిరి పడుతుంది. ముఖం వికృతంగా మారుతుంది. మూతిని సాగదీసి వంకరగా పెడుతుంది. ఈ పరిస్థితి రాబోయే ముందు

బి. రాంబాబు

కెవ్వున కేకలేస్తుంది. రెండు నిమిషాల తరువాత యధావిధిగా ఉంటుంది. ఫిట్స్ కాదని అబ్జర్వేషన్‌లో తేలింది. విపరీతంగా భయపడిందని అనుమానంగా ఉందతడికి. ఇంతలో పెంచలయ్య టీ తీసుకువచ్చారు. ఆ శబ్దానికి ఈ లోకంలోకి వచ్చాడు.

టీ కప్పు తీసుకుంటూ 'వెళ్ళి పడుకోరాదూ!' ఈ వయస్సులో నీకు విశ్రాంతి చాలా అవసరం బాబాయ్' అన్నాడు అభిమానంగా, మందలింపు ధోరణిలో. ఖాళీ కప్పుని టేబిల్‌పై ఉంచి, సిగరెట్ తీసి వెలిగించాడు. 'సిగరెట్లు ఎక్కువగా తాగమాకండయ్యా!' అన్నాడు ఆప్యాయతగా పెంచలయ్య.

'చెల్లాయేం చేస్తోంది?' అన్నాడు సిగరెట్‌ని యాష్ట్రేలో వదులుతూ. '11 దాకా చదివినారండీ... ఆ తరువాత నిద్రలో జారుకున్నారు. లైటార్పి, బెడ్ లైటు వేసి తలుపులు దగ్గరకు వేసి వచ్చాను' అన్నాడు పెంచలయ్య.

చెల్లెలి విషయం తల్చుకోగానే అతని హృదయం బాధగా మూలిగింది. తల్లీతండ్రీ ఇద్దరూ ఉద్యోగస్థులే. ఎందుకోగానీ ఇద్దరూ తీవ్రంగా ఘర్షణ పడేవారు. ఎప్పుడూ గొడవలే. ఎందుకోగానీ అమ్మ తరపు నుంచి గాని, నాన్న తరపు నుంచి గానీ ఎవరూ వచ్చేవారు కాదు. తనకు ఆరవ ఏడు రాగానే ఇద్దరినీ హాస్టల్లో వేశారు. చెల్లి హాస్టల్‌లో ఉండనని మారాం చేసింది. నాన్న తిట్టి, కొట్టి, అక్కడే ఉంచాడు. ఒక రోజు చెల్లి హాస్టల్ నుంచి పారిపోయింది. ఏడేళ్ళ పిల్ల ఏమైందోనని వెక్కివెక్కి ఏడ్చింది అమ్మ. తరువాత కొన్నాళ్ళకు అమ్మ చనిపోయింది. అమ్మను చంపినందుకు నాన్న జైలు కెళ్ళాడని ఎవరో చెప్పారు తనకు... కొన్నేళ్ళకు తాను మిలట్రీకి వెళ్ళాడు. పదేళ్లు మిలటరీలో పని చేశాక తిరిగి వచ్చాడు. అనుకోకుండా ఒక రోజు రైల్వే స్టేషన్‌లో రాణి కనబడింది. తనను గుర్తుపట్టింది. తాను ఆమెను తీసుకుని ఈ ఊరు వచ్చాడు. ప్రశాంతంగా గడపవచ్చని అనుకు




ఉంగుటూరి శ్రీలక్ష్మి కథల పుస్తకం 'ఎంతవారలైనా' ఆవిష్కరణ దృశ్యం.
ఉంగుటూరి శ్రీలక్ష్మి, తురగా జానకీ రాణి, కె.బి. లక్ష్మి, సుధామ, బి.వి. సత్యనగేష్‌లు ఫొటోలో ఉన్నారు

న్నాడు. తానెంత అభిమానంగా పలకరించినా ముభావంగానే ఉంటుంది. ముక్తసరిగా పొడి పొడి మాటలు మాట్లాడుతుంది. "అన్నయ్యా అన్న ప్రియమైన పిలుపే ఉండదు. ఒక పెద్ద మనిషితో, పర పురుషునితో ప్రవర్తించినట్లు" ప్రవర్తిస్తుంది. గతాన్ని అడిగితే చెప్పదు. అం దుకే తాను కూడా బలవంతం చేయలేదు. ఒం టరితనాన్నే ఇష్టపడుతుంది. తామిద్దరూ ముద్దు గా అనుభవించాల్సిన బాల్యాన్ని కోల్పోయారు. అందుకే ఈ పరిస్థితి.

ఇంతలో పాప తండ్రి వచ్చాడు.

"పాపను విజయవాడ గానీ, హైదరాబాదు గానీ తీసుకువెళ్దామని వాళ్ళ మదర్ అంటోం దండీ. ఒకసారి మీ సలహా కూడా తీసుకుందా మని ఇలా వచ్చాను అన్నాడతను కుర్చీలో కూ ర్చుంటూ. పాపకు స్పెషలిస్టు దగ్గర ట్రీట్‌మెంట్ చేయించాలనే స్థిరమైన నిర్ణయంతో వచ్చినట్లు ఉన్నాడు. పాపకు ఏమైనా అవుతుందేమోననే భయం అతని కళ్ళల్లో కనబడుతోంది.

"రేపు ఉదయం తీసుకువెడదాం. నేనూ మీతో వస్తాను" అన్నాడు రాజారాం. ఆ మాట వినగానే అతని మొహంలో సంతృప్తి కనిపిం చింది. డాక్టరు కాదంటాడేమోనని భయంతో వచ్చినట్లున్నాడు.

రెండు నిమిషాల పాటు మౌనం. పాపను గురించిన ప్రశ్నలు వేస్తే ఏమైనా కేసు అర్థమౌ తుందేమోననే ఆశతో అడగడం మొదలుపె ట్టాడతనిని... పాప విపరీతంగా భయపడ్డాని క్కారణం అన్వేషించాలని ఆయన ఆలోచన. బాగా టెన్షన్‌కి, భయానికీ గురైన వాళ్ళు అలా ప్రవర్తించడం సహజం.

పాపను మీ ఇంట్లో అతిగా భయపెట్టడం గాని, తిట్టడంగాని, చిరాకు పడడంగాని, చేయి చేసుకోవడం గానీ జరుగుతుందా? అడిగాడు.

'అబ్బే'! మాపాప అసలు అల్లరి చేయదు. మేం చెప్పినట్లే వింటుందండీ. మేమూ చాలా జాగ్రత్తగా చూస్తాం అంటూ స్పష్టంగా చెప్పాడ తను.

"ఇంటిలో మీరు, మీ భార్య తీవ్రస్థాయిలో గొడవలు పడడం గానీ, ఇంకేమైనా..."? అం టూ అడగబోతూంటే మధ్యలోనే అందుకుని...

'అయ్యో! అదేం లేదండీ' అన్నాడతను పూర్తి గా వినకుండానే.

'ఇలా అడిగానని ఏమీ అనుకోవద్దు. ప్రతి సంసారంలోనూ ఇవి సహజం. మీరిద్దరూ తీవ్ర మైన వాగ్యుద్ధంగాని, తిట్టుకోవడం గానీ చేస్తే ఆ పసి హృదయం తల్లడిల్లి, భయంతో అలా బిహేవ్ చేయవచ్చు.' అన్నాడు తన అభిప్రాయా న్ని నొక్కి చెప్తూ.

'మా ఇద్దరి మధ్యా సామాన్యంగా అభిప్రా యభేదాలు రావు సార్. ఒకవేళ వచ్చినా ఎవరో ఒకరం మౌనం వహిస్తాం. లేదా పాపలేనపుడు పరిష్కరించుకుంటాం. అంతే' అన్నాడతడు స్థిరంగా.

అతని మాటల్లో నిజాయితీ ద్యోతకమౌతోం ది. ఒక నిమిషం తరువాత 'వస్తానండీ'. అం టూ లేచి కరచాలనం చేసి వెళ్ళాడతను.

ఇక పడుకుందామా అనుకుని పైకి లేవబో తూండగా పాప తల్లి ప్రవేశించింది.

మూర్తీభవించిన దుఃఖంలా ఉందామె. పాప గురించి తానేమైనా చెపుతాడేమోనని వచ్చిన ట్లుంది. కూర్చోమని సైగ చేసి కుర్చీ చూపగానే కూర్చుందామె.

'ఎలా ఉంది పాపకు'? అన్నాడు తిరిగి కుర్చీలో సర్దుకుంటూ "నిద్రపోతోందండీ. మరలా ఈ సాయంత్రం కూడా వచ్చింది.' నూతిలో నుండి వచ్చినట్లు ఆమె స్వరం చాలా బలహీనంగా ఉంది. మాటలు తడబడుతున్నాయి.

ఆమెను కూడా క్యాజువల్‌గా కొన్ని ప్రశ్నలడగాలని అనుకున్నాడు. ఆమె మాటలు కూడా వినడం మంచిదనిపించింది. ఆమె ఇచ్చే జవాబులు వినటం వల్ల ఉపయోగం ఉండొచ్చు.

'పాపకు ఇంటిలో ఎవరి దగ్గర మాలిమి'?

'మా ఇద్దరి దగ్గరా' అన్నదామె.

'పాపను ఒంటరిగా వదిలి మీరు సినిమాలగ్గాని, షికారుగ్గానీ వెళుతుంటారా'?

'నేనెక్కడికీ వెళ్ళనండీ... ఉంటే ఇంట్లో లేదా ఆఫీసులో...'

చాలా క్యాజువల్‌గా అడిగిన ప్రశ్నకు ఆమె ఇచ్చిన సమాధానం విని, బాంబు పడ్డట్లు అదిరిపోయాడు డాక్టర్ రాజారాం.

'మీరు ఎంప్లాయినా'? అన్నాడు తీవ్రస్వరంతో.

'అవును సార్' అందామె గొప్పతనాన్ని ప్రదర్శిస్తున్నట్లు తల పైకెత్తి అతిశయంగా. అతని కనుబొమలు ముడిపడ్డాయి. అతని మొహంలో కోపం తొంగి చూస్తోంది. "మీరు ఆఫీసుకు వెడితే పాపను ఎవరు చూస్తారు"? స్వరం పెంచి అడిగాడతను.

పాప ఇంట్లో ఉండదండీ... బడికి వెడుతుంది. డాక్టర్ని అమాయకుడిలా చూస్తూ అంది.

మన శరీరంలోని కండరాలన్నిటిలోకీ నాలుకే బలమైనది.

ఆ మాత్రం తెలియదా అన్నట్లు.

అంటే?

"ఉదయం ఎనిమిది గంటలకల్లా పాప బడికి వెడుతుంది. మేం తొమ్మిదిన్నరకు వెళతాం. సాయంత్రం పాప నాలుగున్నరకు వచ్చి, ఇంటి ముందే ఆడుకుంటుంది. మేం ఐదుకల్లా వచ్చేస్తాం". చాలా సామాన్యమైన విషయంలా చెప్పిందామె.

మరి 'మధ్యాహ్నం'? ఎదురు ప్రశ్న వేశాడతను.


'మధ్యాహ్నం రాదు'. బాక్స్ ఇచ్చి పంపిస్తాను.

'ఒక వేళ మీరు రావడం ఆలస్యమైతే'?

'మా వారు వస్తారుకదండీ!'. ఆవిడకు అది పిచ్చి ప్రశ్నలా తోచింది.

'ఇద్దరూ అలస్యమైతే' ఐమీన్ ఇద్దరికీ ముఖ్యమైన పనులుంటే?' ఎదురు ప్రశ్న వేశాడతను. మేము వచ్చేవరకూ ఆడుకుంటుందండీ!'. ఆయన ఎందుకు సీరియస్ అవుతున్నాడో అర్థం కాలేదామెకు.

'నీ చిన్నప్పుడు మీ అమ్మానాన్నలు నిన్ను కూడా ఇలాగే వదిలి వెళ్ళారామ్మా'? అన్నాడు వ్యంగ్యంగా. అతనికి బాల్యం గుర్తుకువచ్చింది. భయంభయంగా ఇంటి ముందు అమ్మకోసం ఎదురుచూసిన రోజులు గుర్తుకువచ్చాయి. హాస్టల్లో ఉన్నపుడు అమ్మకోసం ఎదురుచూసే మూడవ ఆదివారం గుర్తుకువచ్చింది. అమ్మ రాక కోసం కళ్ళు కాయలు కాసి, విసుగుపుట్టి, నిరాశలో ఉన్నప్పుడు వచ్చేది. ఎప్పుడూ అమ్మ కళ్ళు ఏడుస్తూనే ఉండేవి. ఒక్క అరగంట మాత్రమే ఉండేది. ఇంకా ఇంకా ఉండాలని ఎంత ఆశపడేవాడో. అవన్నీ గుర్తుకురాగానే కోపం కూడా




వస్తోంది. దాన్ని దిగమింగుకుంటున్నాడు. ఏదైనా అడగాలని ఉంది. ఇంకా కోపం వస్తూనే ఉంది.

ఆమె తలవంచి ఏమీ మాట్లాడలేదు.

అతని చూపు టేబుల్ మీద ఉన్న దినపత్రిక పైనబడింది. ఒక మూల బాక్స్‌లో పడిన వార్త చూడగానే ఏదో స్ఫురించింది. చిన్న అనుమానం కదలాడింది. ఒక్క ఉదుటన లేచి పాప రూం వద్దకు వెళ్ళాడు. ఆమెకూడా అతడిని అనుసరించింది. ఆమెను బైటనే ఉండమని సైగ చేసి, లోపలకు నడిచాడు. పాప ఫ్రాక్‌ని పైకెత్తి పరిశీలనగా చూశాడు. అతని అనుమానం నిజమైంది. పాపను ఎవరో ఏదో చేశారనేది నిజం. కేసు అర్థమైందన్న రిలీఫ్‌తో బాటు ఈ వార్తను ఆ తల్లికెలా తెలియజేయాలా అనే భయం అతనిలో కలిగింది. తలుపు దగ్గరగా వేసి, తిరిగి తన రూంలోకి వచ్చి యథాస్థానంలో కూర్చున్నాడు. ఆమె కూడా అలాగే వచ్చి కూర్చుని, డాక్టరుగారేం చెప్తారా అని ఎదురు చూస్తోంది. వినరానిదేదో వినవలసివస్తుందని ఆమె సిక్స్‌ సెన్స్‌ చెబుతోంది. వాతావరణం భారంగా ఉంది. డాక్టర్ సాలోచనగా పేపర్ వెయిట్‌ని అటూ ఇటూ తిప్పుతున్నాడు.

నాలుగు నిమిషాలు నిశ్శబ్ధంగా గడిపాడు. ఆ నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ మరలా తానే 'మీకు ఉద్యోగం చేయడం తప్పనిసరా'? అన్నాడు. 'మీవారు మంచి క్యాడర్‌లో ఉన్నారని విన్నాను. వారి జీతం మీ అవసరాలకు చాలదా?' అన్నాడు ప్రశార్థకంగా.

'మావారి జీతం తప్పితే మాకు వేరే ఆస్తిపాస్తులేమీ లేవు సార్. ఇంతవరకూ వారు తన కుటుంబ బాధ్యతలు మోశారు. మరొక నాలుగేళ్ళ పాటు తప్పదు. ఆమె చాలా నీరసంగా మాట్లాడుతోంది.

'పోనీ ఎవర్నైనా పెద్ద వాళ్ళను తెచ్చి మీ దగ్గర ఉంచుకోవచ్చు కదా! మీ అత్తగారిని...'

"వారు రారండీ'. ఓపిక ఉన్నంతకాలం ఆ ఊరు వదిలి రానంది." మంచంలో పడినప్పుడు ఎలా జరగవలసి ఉంటే అలా జరుగుతుందిలే అంటారామె. పోనీ పాప కోసం రమ్మన్నా, మీ పిల్లల చాకిరీ కోసమేగా మమ్మల్ని రమ్మంది. జీవితమంతా చేసి చేసి విసిగిపోయాను. ఇక నా వల్ల కాదు అన్నారండి. అంతేగాక మా దగ్గరుంటే తన ఆడపిల్లల రాకపోకలు సరిగా జరగవంటుందండీ. వాళ్ళకు తాను స్వతంత్రంగా ఏమైనా పెట్టుకోవాలన్నా ఇబ్బందేనని స్పష్టంగా చెప్పారావిడ అన్నది. ఆనాడు అత్తగారు అన్న మాటలు మదిలో మెదిలి, ఆ మాటలను ఉన్నవి ఉన్నట్లుగానే వివరించింది.

'పోనీ మీ అమ్మగారిని...' వెంటనే అన్నాడు.

'అదీ అయిందండీ'. పుట్టింటి వాళ్ళకు దోచి పెడుతుందని ఒకటే గొడవ. ఏదో పెళ్ళిలో మా అత్తగారు, మా పెద్దాడపడుచు "మా వాడి సొమ్ము తినే అదృష్టం మాకు లేదు గానీ లోకులకు మాత్రం బాగానే ఉంటుంది అంటూ పోట్లు పొడిచింది మాటలతోనే. అంతే... మా అమ్మ ఉండమంటే ఉండకుండా వెళ్ళిపోయింది ఆ మరుసటి రోజు" అన్నది బాధగా. తల్లి ఆసరా లేదనే బెంగ ఆమె మాటల్లో ద్యోతకమౌతోంది. అవును... మధ్యతరగతి కుటుంబాల్లో స్వభావాలు ఎలా ఉంటాయో తనకూ తెలుసు.

'పోనీ ఎవర్నైనా పనిమనిషిని పెట్టుకోవచ్చుగా?' అన్నారాయన.

'నమ్మకస్థులు దొరకడం చాలా కష్టమండీ. ఒకామెను పెడితే దొంగతనం చేయడం, పాపకు పెట్టినవి తినేయడం చేస్తూంటే పంపించి వేశాం' అంది.


'మధ్య తరగతి మిధ్యాభేషజాలు ఇవన్నీ!... ఎంత ఉద్యోగం చేసినా స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యం ఉండదు. ఒక వేళ ఇస్తే వాళ్ళ ప్రవర్తన విపరీతంగా ఉంటుంది. ఆ డబ్బు దగ్గరే తన తల్లిదండ్రులు ప్రతి రోజూ గొడవపడేవారు. ఎంత అభివృద్ధి సాధించినా కొన్ని విషయాల్లో మనం మారం. ఆచారాలు, పద్ధతులు, కట్టుబాట్లు అంటూ కోరి కష్టాలను తెచ్చుకుంటాం. అతను ఒక నిట్టూర్పు వదిలాడు. ఆమెకు ఎలా చెప్పాలా అని ఆలోచిస్తున్నాడు. వాచీ చూసుకున్నాడు. రెండు గంటలు కావస్తోంది. సమిష్టి కుటుంబాల్లో అయితే అమ్మా నాన్నలు పనికి వెళ్ళినా... చిన్నాన్నలు, చిన్నమ్మలుంటారు లేదా ముసలి వాళ్ళు కనిపెట్టుకుంటారు. అదొక తృప్తి. ఆ ముసలి వాళ్ళ కథల్తోనో, పాటల్తోనో పిల్లలు గడిపేస్తారు.

తనకు పాప కేసు అర్థమైంది. ఇలాంటివి చెప్పకుండా దాచిపెట్టే విషయాలు కావు. కానీ ఆమెకు ఎలా చెప్పాలో అర్థం కావడం లేదు. చెప్పక తప్పదు. ఎందుకంటే ఇకముందు అటువంటి సంఘటనలు జరగకుండా ఆమె చూసుకోవాలి. జాగ్రత్త పడాలి. అందుకే చెప్పాలని నిర్ణయించుకున్నాడు.

'మీ పాపకు జరగరానిదేమైనా జరిగితే తట్టుకోగలవా'?

తట్టుకోగలను... అన్నట్టు తలూపింది భయంభయంగా.

తట్టుకోలేదని తెలుసు. కానీ చెప్పకతప్పదు. 'అలాక్కాదమ్మా... మీరు లేని సమయంలో ఆ పాపను ఎవరన్నా ఏదన్నా చేశారనుకో...' డాక్టరు నోటి వెంట ఆమాట పూర్తయిందో లేదో కుర్చీలోనుంచి ఒక్క ఉదుటున లేచి... 'నా తల్లీ, ఏమైందమ్మా నీకు' అని అరుచుకుంటూ పరుగు పరుగున పాప బెడ్‌ని చేరుకుని, నిద్రపోతున్న




పాపను ఒక్క ఉదుటున ఎత్తుకుని, హృదయానికి హత్తుకొని ముద్దులతో నింపసాగింది. ఆమెను అనుసరించిన రాజారాం, పెంచలయ్య అక్కడే నిలబడి ఆ దృశ్యం చూస్తున్నారు.

నిద్రలోనే పాప కళ్ళు తెరిచింది. ఏమి జరిగిందో అర్థం కాకున్నా అమ్మ తనను ఎత్తుకుందని తెలిసి తన రెండు చేతులతో అమ్మను గట్టిగా పట్టుకొని, అమ్మ గుండెల మధ్య మొహాన్నుంచింది. కర్పూరం, వెన్నెల, మంచి గంధం ఇచ్చే చల్లదనాన్ని, హాయినీ పుత్రగాత్ర పరిష్వంగం ఇస్తుందన్న కవి మాట నిజం. ఆమెలో మాతృభావన పెరిగి, కరిగి కన్నీరై ప్రవహిస్తోంది. కొంతసేపు గడిచింది.

'పెంచలయ్యా! పాపను పడుకోబెట్టు' అన్నాడు. ఎప్పుడు వచ్చిందో రాణి... పాపకివ్వమని ఆమె తల్లికి బిస్కట్ ప్యాకెట్ ఇచ్చి ఒకసారి పాప బుగ్గనిమిరి, తన రూంలోకి వెళ్ళింది. ఆ పది నిమిషాల పాటు డాక్టర్ రాజారాంకు ఆమెలో ఒక విద్యావంతురాలో, ఒక ఉద్యోగినో కనబడలేదు. మాతృభావన కలిగిన ఒక పిచ్చితల్లి కనబడింది. తన తల్లికి కూడా అలాంటి ప్రేమ ఉండేదే. కానీ తమను చూసే వీలుండేది కాదు ఆమెకు. రాజారాం నాలుగడుగులు ముందుకు వేసి, ఆమె భుజాలు పట్టుకొని లేపి తనరూంకి తీసుకువచ్చాడు. ఆవు వెంట నడిచే లేగలా అతడిని అనుసరించి రూంలోకి వచ్చీ రాగానే కుర్చీలో కూర్చొని టేబిల్‌పై తల ఆనించి వెక్కి వెక్కి ఏడవసాగింది. రాజారాం ఏమీ మాట్లాడలేదు. ఆమె ఏడిస్తేనే మంచిదని అతని ఆలోచన. అలా ఏడిస్తే దుఃఖం తగ్గి, మనసు తేలికపడుతుందని అతని భావన.

'నీకేం భయంలేదు. పాపను నేను చూసుకుంటాగా. తగ్గి పోతుందమ్మా' అంటూ ఓదార్పు మాటలన్నాక ఆమె ఆపింది.

'పెంచలయ్యా! టీ పట్రా!' అన్నాడు. టీ తెచ్చి ఆమె ముందుంచాడు పెంచలయ్య. ఆమె లేచి మొహం కడుక్కుని టీ తాగింది. టేబిల్‌పై గీతలు గీస్తూ నిలుచుంది. డాక్టరి గారి మాటల

కోసం ఎదురుచూస్తోంది.

"మీకు సమస్యలున్నాయి. కాదనను. సమస్యలెప్పుడూ ఉంటాయి. ఒకదాని వెంట ఒకటి వస్తాయి. మీరు మీ పిల్లల ఆర్థికావసరాల గురించి కంగారుపడేకంటే వాళ్ళ ఎదుగుదల గురించి ఆలోచించాలి. ఒకవేళ మీరు ఉద్యోగం చేయదల్చుకుంటే కొన్ని విషయాలలో సర్దుబాటు ధోరణిని అవలంభించాలి.

పిల్లలు బడి నుంచి ఇంటికి తిరిగివచ్చేసరికి వాళ్ళకు కావలసిన ఏర్పాట్లు చేయాలి. వాళ్ళకు కావలసినవన్నీ అమర్చాలి. వాళ్ళకు ప్రశాంతంగా నిద్రించే, చదువుకునే ఏర్పాట్లు మీరే చేయాలమ్మా!'.

ఆయన చెప్పే మాటలను మంత్రముగ్ధలా వింటోందామె. ఆమెకు అతడు జీవితాన్ని గూర్చి బోధిస్తున్న ఒక ఉపాధ్యాయుడిలా కన్పించాడు.

'వాళ్ళకు అమ్మ ఒడి కావాలమ్మా. ముద్దుమాటలు, గోరు ముద్దలు, అమ్మా నాన్నల అనురాగం కావాలి. తల్లిదండ్రుల మధ్య ఉండే అనుబంధాన్ని చూసి వాళ్ళకు ప్రేమ భావనలు కలగాలి. వాళ్ళకు బాల్యం ఒక వరం కావాలి. పెద్దయ్యాక సమస్యల మధ్య కొట్టుమిట్టాడుతున్నపుడు బాల్యాన్ని తల్చుకుని హాయిని అనుభవించినపుడు అది ఒక మధురస్మృతిగా మిగలాలి. పసిమనసుల్లో పసిడి భావనలు పెంచే ఒక గురువు కావాలి బాల్యం'.

24 గంటలున్న ఒక రోజులో పిల్లవాడు బడిలో ఐదారు గంటల కన్నా ఎక్కువ వుండకూడదమ్మా. 8 గంటలు నిద్రపోవాలి. మిగిలిన సమయమంతా అమ్మ ఒడే వాడి బడి. వాళ్ళనేదో చేయాలని, అన్నీ వారి తలకెక్కించాలనీ మనం వాళ్ళను హింసిస్తున్నాం. మంచి మాటలు, మంచి ఆలోచనలు మంచి భావనలు వాడికి ఇంటి నుంచి కూడా రావాలి కదా! అన్నాడు తన ఉపన్యాసం ముగిస్తూ.

ఆమెకేమీ మాట్లాడాలని అనిపించలేదు. ఆయన చెప్పింది అక్షర సత్యం. ఏం చేయాలో బోధపడింది. రేపటి నుంచి ఏం చేయాలో ఒక నిర్ణయాన్ని భర్తతో సంప్రదించి తీసుకోవాలనుకుంది.

భర్తవచ్చాడామె కోసం. వచ్చీరాగానే ఎవరైయుంటారు దేవీ అన్నాడు భార్యతో. అతనికి పెంచలయ్య ద్వారా జరిగిన విషయం తెలిసింది.


మన ఎదుటి వాటాలో రాజు లేడూ... వాడు ముసలాడు కావచ్చు. పాపను ఆడిస్తూ కథలు చెబుతుండే వాడు. పాపకూడా కాస్తంత ఖాళీ వస్తే తాతయ్యా అంటూ అక్కడే ఉండేది. ఏదో పెద్దవాడల్లే పసిపిల్లను చేరదీస్తున్నాడనుకున్నాను. ఈ మధ్య అతను మన ఇంటికి వస్తే పాప ముభావంగా ఉండడం, అతను పలకకపోవడం గమనించాను గానీ నా పని హడావిడిలో నేను ఉండి పెద్దగా పట్టించుకోలేదు అన్నదామె.

'రాస్కెల్... వాడంతు చూస్తాను' అన్నాడు కోపంతో ఊగిపోతూ.

అతని మాటలకు అడ్డు వచ్చి, 'పోనీయండి'... మళ్ళా అదొక గొడవ. అతడు వస్తే నిలదీసి అడగండి. మీ ఇంటికి రావద్దని చెప్పండి. అన్నాడు రాజారాం. పాప విషయంలో జాగ్రత్తగా ఉండండి అంటూ తగు సలహా ఇచ్చాడు.

'ఉద్యోగమన్నా మానేయండి లేదా పాపను మీ అమ్మ దగ్గర ఉంచండి' అన్నది అప్పుడే వచ్చిన రాణి.

'ఉద్యోగం మానను. అమ్మ దగ్గర ఉంచుతా




ను అన్నది ఆమె'

'పోనీ మీకు ఉద్యోగమే ముఖ్యమైతే పాపను మాకివ్వండి'. మేము పెంచుకుంటాం. మీరు ఇంట్లో ఉన్నప్పుడు మీకే అప్పగిస్తాం అంది రాణి.

'ఈ పాపను ఇవ్వమండీ... పుట్టబోయే వాళ్ళనిస్తాం' అన్నది ఆమె.

ఓహో... మరో బాల్యం మీ ఇంట్లోకి రాబోతున్నదన్న మాట' అన్నాడు రాజారాం ఆమె వైపు ప్రశంసగా చూస్తూ.

"పాపను ఒక వారం పాటు ఇక్కడే ఉంచండి" అంటూ రాజారాం బయటకు నడిచాడు. రాత్రంతా నిద్రలేదు. ఒక రెండు మూడు గంటలైనా నిద్రపోవాలని లైటు ఆపుచేసి, బెడ్ లైట్ స్విచ్ వేయబోయి పొరబాటున టేప్ ఆన్ చేశాడు.

'కలికీ! రెక్కలు రాని పిల్లలను సాకన్ గూటి
లో నుంచి మే

తలకై పోతొక చెంత పెంటి యొక చెంతం
బార, నీలోనం

పిల్లలను పామే గ్రసియించునో వలలపా
లం జిక్కునో పుల్గులు, యా

ఈయిలపై ప్రాణులకున్ వియోగమగుచో
నెవ్వారికెవ్వారలో.

కరుణ రసాత్మకంగా సాగిపోతున్న ఆ రాగం హృదయాన్ని కదిలించి తల్లిదండ్రులిద్దరూ ఉద్యోగస్తులైనందున బాల్యాన్ని కోల్పోయి వ్యధాభరితులై ఏడుస్తున్న ఎంతోమంది పసి పిల్లల ముఖాలు, ఆక్రోశాలు, కష్టాలు, కడగండ్లు కళ్ల ముందు రీళ్ళలా కన్పించేలా చేసింది. చెల్లెలు రాణి గుర్తుకువచ్చి గుండె పిండినట్లయింది. ఎవ్వారికెవ్వారలో అనే మాట ఆలపిస్తూంటే కళ్ళ వెంట ధారాపాతంగా నీళ్లు కారుతున్నాయి డాక్టర్ రాజారాంకు. ●